
సాక్షి
గుంటూరు
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7427 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1807 క్యూసెక్కులు వదిలారు.



సబ్ జైలు సందర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ పార్థసారథి సోమవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 22,035 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 36,950 క్యూసెక్కులు వదిలారు.

మాటకు కట్టబడతారా?

"తుపానులు, అల్పపీడనాలకు అధికంగా ప్రభావితమయ్యే బాపట్ల జిల్లాలోని కరకట్టలను పటిష్ట పరుస్తాం.. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని కరకట్టలన్నీ పటిష్టం చేసి వరదలకు ఒక్క గ్రామాన్ని సైతం ముంపునకు గురికాకుండా చూస్తాం.."
- ఎన్నికలకు ముందు జిల్లాలో పర్యటించిన చంద్రబాబు ఇచ్చిన హామీ

కృష్ణా కరకట్ట పటిష్టం చేస్తామని చంద్రబాబు హామీ



కృష్ణా వరదల సమయంలో ఈనెల 1న అరవింద వారధి వద్ద కరకట్టకు గండి పడిన ప్రాంతం



2009 అక్టోబర్ 5వ తేదీన అర్ధరాత్రి ఓలేరు పల్లెపాలెం వద్ద కృష్ణానది కరకట్టకు గండి

- చంద్రబాబు ఎన్నికల హామీ నెరవేరేనా?
- ఈ నెలలో కనీవినీ ఎరుగని వరద
- అరవింద వారధి వద్ద కృష్ణా గట్టుకు గండి
- పెదపులివర్రు, ఓలేరు–పల్లెపాలెం, రావిఅనంతవరం, చాట్రగడ్డ వద్ద కరకట్టపైకి వరదనీరు
- పలుచోట్ల కట్టకు లీకేజీలు
- బెంబేలెత్తిన కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, రేపల్లె ప్రాంతాల ప్రజలు
- త్రుటిలో తప్పిన ప్రమాదం
- కరకట్టలను బలోపేతం చేయాలంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: నాసిరకంగా మారిన కృష్ణానది కరకట్టలను బలోపేతం చేసి వరద ముప్పునుంచి తప్పించాలని పరీవాహక ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ నెల ప్రారంభంలో వచ్చిన వరదల తాకిడికి బెంబేలెత్తిన జనం తక్షణమే కరకట్టలను బలోపేతంచేసి భవిష్యత్తులో వరద తాకిడికి గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వరద నష్టానికి ప్రభుత్వం ఇచ్చే మొక్కుబడి సాయంతో తమ కుటుంబాలు కోలుకునే పరిస్థితి ఉండదని, పదేపదే వరద బారిన పడి ఇళ్లు, వస్తువులు, పంటలతోపాటు సర్వం కోల్పోకుండా ఉండేందుకు కరకట్టలను ఆధునికీకరించాలని బాధితులు కోరుతున్నారు.

ఒకచోట గండి.. నాలుగుచోట్ల తప్పిన ప్రమాదం

సెప్టెంబర్ 1న కృష్ణా కరకట్టకు కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద గండిపడింది. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లో 24 లంక గ్రామాలు నీటమునిగాయి. అదృష్టవశాత్తు ప్రాణనష్టం లేకపోయినా వేలాది ఇళ్లు, వ్యవసాయ, వాణిజ్య పంటలు నీటమునిగాయి. రూ. వందల కోట్ల నష్టం వాటిల్లింది. ఒక్కచోట కరకట్టకు గండి పడితేనే ఇంతస్థాయిలో నష్టం వాటిల్లింది. 12 లక్షల క్యూసెక్కుల డిజైన్‌తో ఉన్న కృష్ణా కరకట్టలు 11.38 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ఉక్కిరిబిక్కిరయ్యాయి. కరకట్టలు నాసిరకంగా మారడంతో పెదపులివర్రు, చాట్రగడ్డ, ఓలేరు–పల్లెపాలెంల వద్ద వరదనీరు కట్టపైనుంచి వెలుపలికి పార్లి ప్రవహించింది. రావిఅనంతవరం, పెదపులివర్రు, ఓలేరు–పల్లెపాలెంల వద్ద కట్టకు ఊటలు వచ్చి నీరు లీకైంది. పై నాలుగు చోట్ల కరకట్టలు తెగే అవకాశముందని ప్రజలు బెంబేలెత్తారు. అధికారులు, స్థానికులు రేయింబవళ్లు శ్రమించి ఇసుక సంచులు, మట్టి, ఇసుక వేయడంతో తెగిపోకుండా ఆగాయి. నాలుగు చోట్ల కట్టలు తెగిఉంటే ఊహించని ప్రమాదం, నష్టంతోపాటు ప్రాణనష్టం అధికంగా ఉండేది.

40 కిలోమీటర్లకు పైగా కరకట్టలు

బాపట్ల జిల్లాలో చిలుమూరు నుంచి రేపల్లె మండలం పెనుమూడి వరకు 40 కిలోమీటర్లకు పైగా కరకట్టలు ఉన్నాయి. కరకట్టల్లో పైపులు పూడ్చడం, మట్టిని పొలాల్లోకి చదును చేయడంతో బలహీనంగా మారాయి. ప్రధానంగా దోనెపూడి, కోటిపల్లి, వెల్లటూరు గ్రామాల పరిధిలో కరకట్టపై రోడ్డు నిర్మాణం జరగక పోవడంతో నాసిరకంగా మారాయి. తాజాగా వచ్చిన వరదలకు ఈపూరు, కొల్లూరు మధ్యన కరకట్ట అంచు పలుచోట్ల విరిగి పడింది. భట్టిప్రోలు, రేపల్లె ప్రాంతాల్లోనూ కట్టలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో కరకట్టలను బలోపేతం చేయడం అనివార్యంగా మారింది. భవిష్యత్తులో మరోమారు ప్రమాదం సంభవించకుండా ఉండాలంటే కృష్ణా కరకట్టలను యుద్ధ ప్రాతిపదికన మరింత బలోపేతం చేయాల్సి ఉంది.

వాస్తవ పరిస్థితి:
" ఈనెలలో వచ్చిన వరద బీభత్సానికి కరకట్టలకు కొన్ని చోట్ల గండిపడి 24 లంక గ్రామాల్లోని పంటపొలాలు నీటమునగగా, ఊళ్లకు ఊళ్లు జలమయమయ్యాయి. మరికొన్ని చోట్ల మాత్రం అధికారులు, స్థానికులు, రైతులు అప్రమత్తమై ఇసుక బస్తాలను, మట్టిని అడ్డుగా వేసి గండ్లను పూడ్చి నష్టనివారణ చేసుకున్నారు "

పలుమార్లు భారీగా వరద..



సెప్టెంబర్ వరదలకు రావి అనంతవరం వద్ద కృష్ణా కరకట్టపైకి పొర్లిన వరదనీరు

- కృష్ణానదికి 120 సంవత్సరాల తర్వాత ఈ సెప్టెంబర్‌లో భారీ వరద వచ్చింది.
- 2009 అక్టోబర్ 5వతేదీ అర్ధరాత్రి భట్టిప్రోలు మండలం ఓలేరు–పల్లెపాలెం వద్ద కృష్ణా కరకట్టకు గండిపడి రేపల్లె పట్టణం నీటమునిగింది. 10.94 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో నాలుగురోజుల పాటు పట్టణం నీటిలోనే ఉండిపోవడంతో ప్రజలు బోట్లలో తిరగాల్సివచ్చింది.
- 1903 అక్టోబర్ 7న 10.68 లక్షల క్యూసెక్కులు
- 1914 ఆగస్టు 11న 9.49
- 1917 నవంబర్ 2న 9.55
- 1949 సెప్టెంబర్ 24న 9.25
- 1964 అక్టోబర్ 2న 9.88,
- 1998 అక్టోబర్ 17న 9.32 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది.



కరకట్టలు బలోపేతం చేస్తామన్న చంద్రబాబు

తనకు అధికారం అప్పగిస్తే కృష్ణా కరకట్టలను బలోపేతం చేస్తామని గత ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. తాజాగా వచ్చిన వరదలను కళ్లారా చూసిన చంద్రబాబు బాపట్ల జిల్లాలో కృష్ణాకరకట్టలను బలోపేతం చేసేందుకు తక్షణమే సిద్ధం కావాల్సి ఉంది. వచ్చే వర్షాకాలం సీజన్ నాటికైనా కరకట్టలను బలోపేతం చేయకపోతే మరోమారు జిల్లా వాసులు వరద విపత్తును ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరకట్టల బలోపేతానికి సన్నద్ధం కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కరకట్ట బలోపేతంపై తక్షణం స్పందించాలి



కరకట్టలు బలహీనంగా మారడంతో వరదల సమయంలో నదీ తీరానికి ఇవతలి పక్కనున్న వందలాది గ్రామాలు, పట్టణాలు భయం గుప్పెట్లో జీవనం సాగించాల్సిన పరిస్థితి. 2009 కృష్ణా వరదల కారణంగా కరకట్టకు కోత ఏర్పడి ఎన్నో గ్రామాలు, పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. ఇటీవల సంభవించిన వరదల సమయంలో కరకట్టలు ఎక్కడ తెగుతాయోనన్న ఆందోళనతో ప్రజలందరూ మూకుమ్మడిగా కరకట్టలపై రేయింబవళ్లు కాపాలాలు కాసుకొని, ఇసుక మూటలు వేచి తెగకుండా శ్రమించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇటువంటి పరిస్థితి మళ్లీ దాపురించి పంట నష్టంతోపాటు, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రభుత్వం తక్షణం స్పందించి కరకట్టను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలి.

– ఇంటూరి ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యుడు, దోనేపూడి, కొల్లూరు మండలం

విశ్రాంత డీఎస్పీ ఇంటిలో భారీ చోరీ

- దొంగలు కారులో వచ్చి చోరీ చేసినట్లు గుర్తించిన పోలీసులు
- 28 సవర్ల బంగారం, రెండు వజ్రాల నెక్లెస్‌లు, ఏడు కిలోల వెండి అపహరణ



పెంచలనాయుడు కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్న పోలీసులు

లక్ష్మీపురం: కారులో వచ్చి ఇద్దరు వ్యక్తులు విశ్రాంత డీఎస్పీ ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నక్లెస్‌లు, వెండి వస్తువులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని చంద్రమౌళీనగర్ 6/1ఎ లైన్‌లో దొంగలు కారులో నుంచి దిగి తొలుత కృష్ణా రెసిడెన్సీ అపార్టుమెంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వాచ్‌మన్ మెలకువగా ఉండటాన్ని గమనించి దాని ఎదురుగా ఉన్న లీలా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి రెక్కీ నిర్వహించారు. మొదటి అంతస్తులో విశ్రాంత డీఎస్పీ పెంచల నాయుడు ఇంటికి తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. ఆయన శనివారం కుటుంబ సభ్యులతో నెల్లూరు వెళ్లారు. దీంతో ఇద్దరు దొంగలు ఇంటి ప్రధాన తలుపు తాళాలు పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉన్న బంగారం, వజ్రాల నక్లెస్‌లు, వెండి వస్తువులను చోరీ చేసి తిరిగి అదే కారులో పరారయ్యారు.

అయితే ఉదయం వాచ్‌మన్ మొదటి అంతస్తులోకి వెళ్లిన సమయంలో తలుపులు పగలగొట్టి ఉన్నట్లు గమనించాడు. తక్షణమే విశ్రాంత డీఎస్పీ పెంచల నాయుడుకు సమాచారం తెలియజేశారు. ఆయన ఈ విషయాన్ని పట్టాభిపురం పోలీసులకు, వెస్ట్ డీఎస్పీ జయరాంప్రసాద్‌కు తెలిపారు. దీంతో డీఎస్పీ, పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, సీసీఎస్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకుని కీలకమైన ఆధారాలను సేకరించాయి. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను డీఎస్పీ పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి కృష్ణా రెసిడెన్సీలో గమనించి, ఆ తరువాత లీలా హోమ్స్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. విశ్రాంత డీఎస్పీ పెంచలనాయుడు కుటుంబ సభ్యులతో సాయంత్రం 4 గంటలకు అపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బీరువాలో ఉన్న 28 సవర్ల బంగారం, ఏడు కేజీల వెండి, రెండు వజ్రాల నక్లెస్‌లు చోరీ అయినట్లు ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్జీల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకం




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు. ప్రతి వారం వచ్చే అర్జీలు..పరిష్కరించే విధానం.. ఎన్ని పరిష్కారం అవుతున్నాయో ఆయా శాఖాధికారులు తప్పకుండా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. కొన్ని అర్జీలు తూతూమంత్రంగా పరిష్కరించి మూసేస్తున్నట్లు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకేచోటకు చేరడం అంటే అర్థం చేసుకోవాలని అధికారుల చెప్పారు. అర్జీ పరిష్కారం కోసం ప్రజల్ని పదే పదే తిప్పుకోకుండా చూడాలని తెలిపారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని వివరించి తెలపాలని ఆమె సూచించారు. అనంతరం వచ్చిన 264 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్డీడీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఇసుక దొరకడం లేదు



ఉచిత ఇసుక ఇస్తామని పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో చూడాలి. జిల్లాలో ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో పనులు దొరక్క భవన నిర్మాణ కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. రాజధాని నిర్మాణంలో జిల్లా భవన కార్మికులను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలి.
–సీఐటీయూ నాయకులు, గుంటూరు

మమ్మల్ని ఉంచారా.. తీసేశారా?

గడచిన ప్రభుత్వ హయాంలో కేవలం రూ.5000 తక్కువ జీతంతో నిబద్ధతతో పని చేశాం. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తోంది. మాకు జీతాలు ఇవ్వడంలేదు. అసలు మేము విధుల్లో ఉన్నట్లా.. తీసేశారా ? ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం. తక్కువ జీతానికైనా పని చేయాలనుకుంటే అదీ లేకుండా చేస్తున్నారు. న్యాయం చేయండి.
– వలంటీర్లు



యూనివర్సిటీ ఏసీఈగా ఎన్.యోబు



యోబుకు నియామక పత్రాలు అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ ఏసీఈ అదనపు పరీక్షల నియంత్రణధికారి)గా డెప్యూటీ రిజిస్ట్రార్ ఎన్ .యోబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ తనను అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు మంచి సేవలు అందిస్తానని చెప్పారు. యూనివర్సిటీ ఖ్యాతి ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వికాస కార్యదర్శి కె. శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఉద్యోగులు భానుప్రసాద్, ఎస్. నాగేశ్వరరావు, జె. శ్రీనివాసరావు, వై. రాధాకృష్ణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

దుర్గమ్మకు కాసుల హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు 53 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. గుంటూరు శ్రీనగర్ కాలనీకి చెందిన కె. కిరణ్‌బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి సోమవారం వచ్చింది. ఈ సందర్భంగా రూ. 3.50 లక్షల విలువైన 53 గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీకాసుల హారాన్ని ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.



న్యూస్‌రీల్

గుంటూరు డీటీసీగా సీతారామిరెడ్డి

పట్నంబజారు: గుంటూరు జిల్లా డీటీసీగా కె. సీతారామిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయవాడలో డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరుకు బదిలీ చేస్తూ ఆర్టీఏ అధికారులు ఆదేశాలు వెలువరించారు. ఇప్పటివరకు పనిచేసిన షేక్ కరీంను ఏలూరుకు బదిలీ చేశారు. జిల్లా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఎన్. శివరామ ప్రసాద్‌ను నియమించారు.

యార్డుకు 49,763 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 49,763 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,672 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,242 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

దేవదాయ శాఖ ఏసీగా గ్రంధి మాధవి బాధ్యతలు

పట్నంబజారు: దేవదాయ శాఖ గుంటూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా గ్రంధి మాధవి నియమితులయ్యారు. తెనాలిలోని వైకుంఠపురం ఏసీగా పనిచేస్తున్న ఆమెను జిల్లా ఏసీగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.


రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీలు

నరసరావుపేట: రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌లు కూర్చొని విధులు నిర్వహించే పోడియం ప్రదేశం జడ్జి చాంబర్ లాగా ఉండకూడదనే నిబంధన అమలు చేశారా.. లేదా ? అనేది పరిశీలించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్‌లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పౌరులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో పి.సరోజని, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటప్పకొండ ఆలయ ఈఓగా చంద్రశేఖరరావు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈఓగా డి. చంద్రశేఖరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదీలల్లో భాగంగా కోటప్పకొండ ఆలయ ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈఓగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాసరెడ్డి అమరావతి ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



నాదెండ్ల: యడ్లపాడు మండల పరిధిలోని చెంఘీజ్‌ఖాన్‌పేట–సంతపేట గ్రామాల మధ్య చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగటంతో సబ్‌స్టేషన్‌లో ట్రిప్ కావటంతో సరఫరా నిలిచిపోయి పెను ప్రమాదం తప్పింది. ఈ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం నిమ్మకాయలు క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **7,500**

మోడల్ ధర రూ. **6,200**

క్లుప్తంగా

ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థులు


ఉమా మహేష్


ముఖేష్

తాడేపల్లి రూరల్: పెరు దేశంలోని లిమాలో ఈ నెల 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కేఎల్‌యూ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్‌లు ఎంపిక య్యారని వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ కె. హరికిశోర్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీలలో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందని చెప్పారు. ఇందులో తమ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమా మహేష్ ఉన్నట్లు తెలిపారు. ముఖేష్ సీఎస్ ఐటీ మూడో సంవత్సరం , ఉమా మహేష్ 4వ సంవత్సరం చదువుతున్నాడని పేర్కొన్నారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్‌ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్‌లతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు వర్సిటీ వీసీ జి. పార్థ సారథివర్మ, ప్రో వైస్‌చాన్సలర్ ఎ.వి.ఎస్. ప్రసాద్,రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ కె.హరికిశోర్, వ్యాయామ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

27న చదరంగం పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులు, విద్యార్థులకు క్రీడా పోటీలు, జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల చెస్, అక్టోబర్ 3న చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో నెట్‌బాల్, జూడో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు విధిగా టెన్త్ మార్కుల జాబితా కాపీపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

తత్వశాస్త్ర ఉద్దండుడు కొత్త సచ్చిదానందమూర్తి

నేడు తెనాలిలో శత జయంతి సభ, పుస్తకావిష్కరణ


ఆచార్య సచ్చిదానందమూర్తి

తెనాలి: భారత జాతి గర్వించదగిన గొప్ప తత్వవేత్తల్లో ఒకరు ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి. ఆయన భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారు. తన మేధస్సు, రచనలతో వచ్చిన గుర్తింపుతో విదేశాల్లో ఎన్నో పదవులు వరించినా, మన సంస్కృతిపై మమకారంతో ఇక్కడే స్థిరపడ్డారు. దేశ విదేశాల్నుంచి ఎన్నో గౌరవాలను అందుకున్నారు. తనకిష్టమైన అధ్యయనం, గ్రంథరచనలో గడిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు సైతం చేరువ చేశారు. తెనాలి ఇంప్రెషన్స్, వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో ఆచార్య మూర్తి శత జయంతి సభ, పుస్తకావిష్కరణను మంగళవారం తెనాలిలో నిర్వహించనున్నారు.

తెనాలి బిడ్డ

తెనాలికి సమీపంలోని సంగంజాగర్లమూడి సచ్చిదానందమూర్తి స్వస్థలం. 1924 సెప్టెంబరు 25న సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. స్వయంకృషి, సాధన, జిజ్ఞాసతో తాత్విక వాఙ్మయాన్ని ఔపోసన పట్టారు. సంస్కృత భాషాధ్యయనం చేస్తూనే, పన్నెండేళ్లకే హిందీ విశారద పట్టా పొందారు. పదిహేనేళ్లకే తెలుగులో భగవద్గీతకు వ్యాఖ్యానం రాశారు. తత్వశాస్త్రంలో ఉద్దండులైన శైలేశ్వరసేన్, పీటీరాజుల వద్ద అధ్యయనం చేసి, పట్టభద్రులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఆనర్స్ డిగ్రీ చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర కళాశాల, మయూర్‌భంజ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు.


రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ నుంచి పద్మవిభూషణ్ అవార్డు అందుకుంటున్న సచ్చిదానందమూర్తి

1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రవేశం

1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర అధ్యాపకుడిగా చేరారు. అనతికాలంలో ఆ విభాగం అధ్యక్షుడిగా, ప్రొఫెసర్‌గా పదోన్నతిని పొందారు. పదవీ విరమణ వరకు అక్కడే కొనసాగారు. 1975–78లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా పనిచేశారు. 1986–80 మధ్య యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. అమెరికా, బ్రిటన్, చైనా, థాయ్‌లాండ్, జపాన్, మంగోలియా, బర్మా వంటి పలు దేశాల్లోని పలు విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేశారు. 1968లో పాట్నాలో జరిగిన భారతీయ తత్వశాస్త్ర సభకు అధ్యక్షత వహించారు. 1980–94 మధ్య ఇండియన్ ఫిలసాఫికల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. సారనాథ్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో గల 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టిబెటన్ స్టడీస్'కు 1985 నుంచి చాన్సలర్ హోదాతో సమానమైన అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు.

ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై గ్రంథ రచన

భారత నాగరికత, చరిత్ర, హిందూ ధర్మశాస్త్రాలు, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12పైగా గ్రంథాలను ఆచార్య మూర్తి రచించారు. 'రివిలేషన్ ఇన్ అద్వైత వేదాంత' గ్రంథం మతాలకు సంబంధించిన తత్వాలపై మహోన్నతమైనదిగా గుర్తింపు పొందింది. 'ద ఇండియన్ స్పిరిట్' అనే పుస్తకంతో భారతీయ సంస్కృతిలోని అపోహల్ని తొలగించారు. ఈ దేశ సంస్కృతిని విమర్శించేవారికి గట్టి సమాధానం చెప్పారు. ఆచార్య మూర్తి రాసిన 'వేదార్థ మీమాంస' మరో గొప్ప సాహసం అంటారు. వేదాలపై గల భయాన్నీ, భ్రమలను తొలగించే ప్రయత్నమది. వేదాలను దైవీకరణ నుంచి తప్పించి, మానవీకరణ విశ్లేషణలతో సాగిన పుస్తకం ఇది.

నాగార్జున విశ్వవిద్యాలయం స్థల ఎంపికలో చొరవ

ఆంధ్ర విశ్వవిద్యాలయంకు అనుబంధంగా గుంటూరులో పీజీ సెంటర్ ప్రారంభించినపుడు ఆచార్య మూర్తి కొంతకాలం స్పెషలాఫీసర్‌గా పనిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలలు ప్రారంభించాలనే ప్రతిపాదన వచ్చినపుడు ఆయన నేతృత్వంలోని కమిటీ వాటిని పరిశీలించి చేసిన సిఫార్సులపై పలుచోట్ల డిగ్రీ కళాశాలలు వచ్చాయి. ఈ పీజీ సెంటరే 1976లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. స్థలం ఎంపిక, తదితర అంశాల్లోనూ ఆయన చొరవ చూపించారు. ఆయన కృషి ఫలితంగా నాగార్జున విశ్వవిద్యాలయంలో రూ.30 లక్షల వ్యయంతో 'ఆఫ్రో ఏషియన్ తత్వశాస్త్ర అధ్యయన సంస్థ'ను ఏర్పాటుచేశారు.

పలు విశ్వ విద్యాలయాల నుంచి డాక్టరేట్లు

ఆచార్య మూర్తి కృషికి గుర్తింపుగా దేశంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లు, రెండు ప్రతిష్టాత్మక సంస్కృత పీఠాల నుంచి గౌరవ మహామహోపాధ్యాయ బిరుదులతో పాటు అనేక ప్రభుత్వ సంస్థల నుంచి అవార్డులు వచ్చాయి. తత్వశాస్త్రంలో గల ఒకే ఒక అవార్డు 'బీసీ రాయ్ అవార్డు'ను తొలిసారిగా ఆచార్య మూర్తి అందుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' (1984), 'పద్మవిభూషణ్' (2001) గౌరవాలను స్వీకరించారు. 2007లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఫిలసాఫికల్ రీసెర్చ్ రజతోత్సవం సందర్భంగా జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఇలా తాత్వికరంగంలో ఎవరూ పొందలేని గౌరవాన్ని డాక్టర్ మూర్తి అందుకున్నారు. విశ్రాంత జీవితాన్ని సొంతూరులోనే గడుపుతూ 2011 జనవరి 24న కన్నుమూశారు.

రేపు ప్రత్యేక పోస్టల్ కవర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25న ఆయన పేరుతో కంగా పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించనున్నామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: హౌసింగ్ లే అవుట్స్, సొంత స్థలాలు, ఇప్పటికే మంజూరు చేసిన స్థలాల్లో ఆప్షన్ 1, 2 విభాగంలో నిర్మిస్తున్న ఇళ్లను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మన ఇల్లు– మన గౌరవం కార్యక్రమాన్ని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మంజూరు చేసిన ఇళ్లల్లో 28,730ను ఆప్షన్-1, 2లలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్నారని కలెక్టర్‌తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 11 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, మిగతావి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రతి లేఅవుట్‌కు ప్రత్యేకాధికారుల్ని నియమించి మంగళ, బుధవారాల్లో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేకాధికారులు ఈ నెల 26న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించి, వివరాలు సేకరించాలని ఆమె తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 100 రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు
- రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి
- సుఖీభవ కింద వెంటనే రూ. 20 వేలు అందించాలి
- తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో ధర్నా



రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తున్న నేతలు

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి, ప్రకటించిన సుఖీభవ పథకం కింద రూ. 20 వేలను ఖాతాలో వేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజధాని రైతు సంఘ నేతలు, రైతులతో ఆయన ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గత నెల భారీగా కురిసిన వర్షాలు, కృష్ణా, గోదావరితో పాటు పలు నదులు, వాగులు, వంకలు, చెరువు కట్టలు తెగి రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు.ముఖ్యమంత్రి నివాసముంటున్న తాడేపల్లి మండలంలోని చిర్రావూరులో గేదెలు, వరిగడ్డి వాములు కొట్టుకుపోయాయని, వారిని కూడా గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. వరి పంట ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. విత్తనాలు ఉచితంగా అందించాలని, ఎరువులు, పశువుల గడ్డి సబ్సిడీపై ఇవ్వాలని తెలిపారు. చిర్రావూరులో పశువుల డాక్టర్‌ను నియమించాలని, మెల్లెంపూడి డొంక గండ్లన పూడ్చాలని, ఉండవల్లి పంపింగ్ స్కీమ్ విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజధాని అసైన్డ్ రైతులకు, రైతులకు కౌలు మొత్తం చెల్లించాలని, స్పీడ్ యాక్సెస్ రోడ్డు ప్యాకేజీ పెంచాలని విన్నవించారు. యు-1 గ్రీన్ జోన్లను ఎత్తివేయాలని, రైతాంగం మీద ఒత్తిడి తీసుకురావద్దని కోరారు. రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు కె. ఈశ్వర్‌రెడ్డి, వీరాస్వామి, సీఐటీయూ నాయకులు దుర్గారావు, రైతు సంఘం నాకయకులు భక్తిరెడ్డి, దండమూడి సాంబశివరావు, సొనకం కోటేశ్వరరావు, గాంధీ, రామారావు, యస్‌కే ఎర్రపీరు, డి. భాస్కర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నీరుడు దుర్గారావు, సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వరరావు, బొబ్బిలి రామారావు, సత్యం, జగన్ శాస్త్రి, తులసమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఆవేదన
- న్యాయం చేస్తామని ఎస్పీ హామీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసులు

నగరంపాలెం: రైల్వే, హైకోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నుంచి పెద్ద మొత్తంలో కాజేశారని బాధితులు వాపోయారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారు. నెల రోజుల తర్వాత జరగడంతో బాధితులు అధికంగా వచ్చారు. అర్జీల నమోదులో కానిస్టేబుళ్లతోపాటు పలువురు ఎస్‌ఐలు విధులు నిర్వహించారు. పలువురి నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. బాధితుల బాధను ఆయన ఆలకించారు. ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), సుబ్బారావు (మహిళా పీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.

రైల్వేలో, హైకోర్టులో ఉద్యోగాలు పేరిట మోసం

నాలుగేళ్ల కిందట వివాహ నిమిత్తం సన్నాయి వాయించేందుకు వెళ్లాం. ఈ క్రమంలో చిలకలూరిపేట వాసి పరిచయమయ్యాడు. రైల్వేలో, హైకోర్టులో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించాడు. రైల్ నిలయం, ఎల్‌బీనగర్ సంగారెడ్డి, గుంటూరు జిల్లా కోర్టు, ఏపీ హైకోర్టు ప్రాంగణంలో ఇంటర్వ్యూలు పేర్లతో పిలిపించాడు. ఉద్యోగాలు వచ్చాయని చెప్పి, నకిలీ పోలీసులతో విచారణ చేయించారు. ఏళ్లు గడిచినా ఉద్యోగాలు రాలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించాం. ఇక డబ్బులు అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడేవాడు. గతంలో బ్యాంక్ ఖాతాకు, ఫోన్ పేలకు చేసిన నగదు చెల్లించమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కుమార్తెకు రైల్వేలో అటెండర్ ఉద్యోగం కోసం రూ.9 లక్షలు చెల్లించినట్లు పెదనందిపాడు లూథరన్ చర్చి వద్ద ఉండే మంచాల జయరావు వాపోయారు. ఇద్దరు కుమారులకు రైల్వేలో రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇప్పిస్తానంటే రూ.18 లక్షలు చెల్లించినట్లు బాపట్ల జిల్లా చెరువుజమ్ములపాలెం గ్రామ వాసి దేవరకొండ నాగరాజు తెలిపారు. హైకోర్టులో ఉద్యోగం కోసం రూ.9 లక్షలు చెల్లించినట్లు శ్యామలానగర్‌కు చెందిన సభావత్ సుజాత తెలిపింది. ఉద్యోగాలు వస్తాయంటే పొలం, నగలు, తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి డబ్బులు అతనికి చెల్లించాం. ఏళ్లు గడిచిన అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేవాడు. నెలసరి వడ్డీలు చెల్లించకపోతున్నాం. న్యాయం చేయాలి.


ఉద్యోగాల పేర్లతో మోసపోయిన బాధితులు

– సభావత్ సుజాత (శ్యామలానగర్),
మంచాల జయరావు (పెదనందిపాడు),
దేవరకొండ నాగరాజు (బాపట్ల)

వర్క్ ఫ్రం హోం పేరుతో మాయాజాలం

ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన వ్యక్తికి కాల్ చేయగా, కంపెనీలో వర్క్‌ఫ్రం హోం ఉద్యోగాలు ఉన్నాయని తెలిపాడు. దీంతో దరఖాస్తుకు రూ.2 వేలు, అప్రూవల్‌కు రూ.5 వేలు, కంపెనీ ఉత్పత్తులు కోసం రూ.15 వేలు, పంపిణీ చార్జీలు రూ.5 వేలు అంటూ సుమారుగా రూ.30 వేలు కాజేశారు. సదరు ఉత్పత్తులకు ప్రచారం చేయాలని, అందులోనూ వ్యక్తులను చేర్చాలని తెలిపారు. దీనికి తోడు నిరుద్యోగులను నమ్మించేందుకు కొందరు అమ్మాయిలకు జాబ్ వచ్చినట్లు ఇన్‌స్టాగాంలో చెప్పించేవారు. ఈ విధంగా పలువుర్ని మోసగించగా, దాదాపు లక్ష రూపాయాలకు పైగా చెల్లించామని వాపోయారు. సదరు కంపెనీ నిర్వాహకుడిది గుంటూరు అని చెప్పడంతో ఇక్కడకు వచ్చాం.

– ఎల్.నందీశ్వర్, యేగేష్, పవన్,
రామంజపూర్, శంషాబాద్, హైదరాబాద్

పిడుగుపాటుతో మహిళ మృతి

రేపల్లెరూరల్: పిడుగుపాటుతో మహిళ మృతిచెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు 25వ వార్డుకు చెందిన కొలుసు పద్మ సోమవారం సాయంత్రం తన గొడ్లసావిడి వద్ద పనిచేసుకుంటున్న సమయంలో ఆకస్మికంగా కురిసిన వర్షంతో సమీపంలో పిడుగు పడింది. దీంతో పద్మ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

స్టిక్కరింగ్‌తో కలరింగ్




గుంటూరు నగరం ఆంజనేయపేట, అమరావతి రోడ్డులో స్టిక్కర్లు అంటిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలు

ప్రజలకు సేవ చేయడానికి గత ప్రభుత్వం నియమించిన సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకుండా అడ్డమైన పనుల్ని చేయిస్తోంది. ఇప్పటికే పింఛన్ల పంపిణీలో వాడుకుంటోంది. ప్రజలకు ఆరోగ్య సేవల్ని అందించాల్సిన సచివాలయ ఏఎన్‌ఎంలను ఏకంగా ప్రచారానికి వాడుకుంటోంది. నగరంలో ఇంటింటికీ ఏఎన్‌ఎంలు తిరుగుతూ 'మంచి ప్రభుత్వం' స్టిక్కర్లు అతికిస్తున్నారు.

– సాక్షి, గుంటూరు ఫొటోగ్రాఫర్

జిల్లాలో ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. ప్రత్తిపాడు మండలంలో 11 మిల్లీ మీటర్లు, పెదనందిపాడు 8.4, మంగళగిరి 5, తెనాలి 3, పొన్నూరు 1.8, కాకుమాను 1.2, చేబ్రోలు 1, గుంటూరు పశ్చిమలో 0.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ

రూ 70వేలు, రూ. 4లక్షల విలువైన సామగ్రి చోరీ

మంగళగిరి: నగర పరిధిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటులో చోరీ జరిగింది. రూరల్ సీఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. చినకాకానిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి కార్యాలయం అద్దాలు పగలకొట్టారు. కౌంటర్‌లోని రూ. 70వేలతో పాటు రూ. 2.50లక్షల విలువైన విద్యుత్ వైరుని దొంగలించారు. భవన యజమాని నేరేళ్ల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి


దేవరాజు మృతదేహం

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్వానగర్ 4వ లైనుకు చెందిన చల్లా దేవరాజు (13) స్నేహితులతో కలిసి ఆడుకుంటూ స్థానికంగా ఉండే సమ్మర్‌పేట స్టోరేజ్ ట్యాంక్ చెరువులో పడ్డాడు. స్థానికులు గమనించి బయటకు తీసి, చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సంఘటనపై మృతుని తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సత్తా చాటిన కృష్ణా జిల్లా గిత్తలు

ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు


పోటీల్లో బండలాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: నందమూరి తారక రామారాము మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు ముగిశాయి. ఆఖరి రోజైన సోమవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. కృష్ణా, బాపట్ల, నంద్యాల, గుంటూరు, పల్నాడు జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి గిత్తలు పోటీల్లో పాల్గొన్నాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్ గిత్తలు 2,385.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి గిత్తలు 2,123 అడుగులు లాగి ద్వితీయ, నంద్యాల శిరివెల్ల మండలం గుంపుంమాందిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి గిత్తలు 2,113.2 అడుగులు లాగి తృతీయ, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి గిత్తలు 1936.11 అడుగులు లాగి నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. వీరికి కమిటీ సభ్యులు, స్థానిక తెలుగుదేశం నాయకులు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేశారు.